క్లుప్తంగా

లక్ష్మీచెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారికి, రాజ్యలక్ష్మి అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

సర్పంచ్ ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న మస్తాన్

తర్లుపాడు: మండలంలోని కేతగుడిపి ఎస్సీపాలెంలో నివాసం ఉంటున్న కోటయ్య అనారోగ్యంతో మృతిచెందగా, అతని కుటుంబానికి గ్రామ సర్పంచ్ డీపీ మస్తాన్ శనివారం రూ.13,500 ఆర్థిక సాయం అందించారు. నిరుపేద కుటుంబం కావడంతో తనవంతు బాధ్యతగా ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు.

గ్రూపుల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న సుధాకర్

కొనకనమిట్ల: గ్రామాల్లో పొదుపు గ్రూపుల అభివృద్ధే లక్ష్యంగా గ్రామైక్య సంఘ సభ్యులు కృషి చేయాలని వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ సుధాకర్ సూచించారు. శనివారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో వీఓఏలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రూపు సభ్యులు తీసుకున్న రుణాలను సక్రమంగా కట్టించేలా, మళ్లీ కొత్తగా బ్యాంక్ రుణాలు ఇప్పించేలా గ్రామైక్య సంఘం కృషి చేయాలన్నారు. స్త్రీనిధి రుణాలు రికవరీ చేయాలన్నారు. ఏపీఎం బి.సుధాకర్, స్త్రీనిధి మేనేజర్ సులోచన, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, అకౌంటెంట్ నాగమణి, ఎఫ్‌పీఓ అరుణకుమారి, గ్రామ సంఘ ఓబీలు, వీఓఏలు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఉల్లాస్ వాచక పుస్తకాల పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ శ్రీనివాసరెడ్డి

పొదిలి: స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం ఉల్లాస్ వలంటీర్లకు వాచక పుస్తకాలను ఎంఈఓ మామిళ్లపల్లి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. పొదుపు గ్రూపుల్లోని నిరక్షరాస్యులైన మహిళలకు చదువు నేర్పించే ఉల్లాస్ కార్యక్రమంలో స్వచ్ఛందంగా ముందుకొచ్చిన వలంటీర్లకు శ్రీనివాసరెడ్డి అభినందనలు తెలిపారు. అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ చెన్నారెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుభాషిణి, ఏపీఎం గోపాలకృష్ణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు మెహరున్నీసా, సీసీలు, వీఓఏలు, వలంటీర్లు పాల్గొన్నారు.

25 కేసుల నమోదు


కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై రాజమోహన్‌రావు

మార్కాపురం: పట్టణంలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న పలువురితో పాటు హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులపై మొత్తం 25 కేసులు నమోదు చేసినట్లు స్థానిక సీఐ సుబ్బారావు, టూటౌన్ ఎస్సై రాజమోహన్‌రావు తెలిపారు. తర్లుపాడు రోడ్డులో పలువురు బహిరంగ ప్రదేశాలలో నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం సేవిస్తున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ద్విచక్ర వాహనదారులంతా కచ్చితంగా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు.

సమస్య మరుగున..


బాలికలు వినియోగిస్తున్న మరుగుదొడ్లు


మరుగుదొడ్ల వద్ద ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

- కొమరోలు జెడ్పీ హైస్కూల్లో బాలికలకు మరుగుదొడ్లు లేక ఇక్కట్లు
- వందల మంది బాలికలకు రెండే మరుగుదొడ్లు

కొమరోలు: వందల మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్న పాఠశాలలో రెండు మరుగుదొడ్లు మాత్రమే ఉండడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరుబయటకు వెళ్లకుండా మరుగుదొడ్లను తప్పనిసరిగా వాడాలి అనే నినాదం క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. వందల మంది విద్యార్థినులు ఉన్న పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కొమరోలు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 285 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి బాలికలు ప్రతి రోజు ఉదయం 9 నుంచి పాఠశాలకు చేరుకుని సాయంత్రం 5 గంటల వరకు 8 గంటల పాటు ఆ పాఠశాలలోనే ఉంటారు. కానీ బాలికలకు కేవలం రెండు మరుగుదొడ్లు మాత్రమే ఉండడం, అవి కూడా సక్రమంగా నిర్వహించక పోవడంతో బాలికలు మూత్రవిసర్జనకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. 285 మంది బాలికలకు ఆ రెండు మరుగుదొడ్లు సరిపోకపోవడంతో మరుగుదొడ్ల వినియోగానికి బాలికలు అక్కడే వేచి ఉంటున్నారు. ఉన్న ఆ రెండు మరుగుదొడ్ల వద్ద కూడా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి ఉండడంతో వర్షాలు పడిన సమయంలో విషపు పురుగులు తిరుగుతున్నాయని, బాలికలు భయభ్రాంతులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నూతనంగా మరుగుదొడ్లను నిర్మించాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

మరుగుదొడ్లు సరిపోవడం లేదు



పాఠశాలలో ఎక్కువ సంఖ్యలో బాలికలు ఉన్నారు. ఈ మరుగుదొడ్లు మాకు సరిపోవడం లేదు. ఇంటర్వెల్ సమయంలో అందరం ఒక్కసారిగా మరుగుదొడ్ల కోసం వెళ్లినప్పుడు ఎక్కువ సమయం అక్కడే ఉండాల్సి వస్తోంది. మా అందరికీ సరిపడేలా మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– పి.సేహ, 9వ తరగతి విద్యార్థిని

నూతన మరుగుదొడ్లు నిర్మించాలి



మా పాఠశాలలో రెండు మాత్రమే బాలికలకు చెందిన మరుగుదొడ్లు ఉన్నాయి. ఈ మరుగుదొడ్లు మాకు సరిపోవడం లేదు. నేను వేరే గ్రామం నుంచి పాఠశాలకు వస్తున్నాను. దీంతో మరుగుదొడ్లను వినియోగించుకోవడానికి వెళ్లినప్పుడు ఇబ్బందులు పడుతున్నాం. నూతనంగా మరుగుదొడ్లను నిర్మిస్తే మాకు బాగుంటుంది. అత్యవసరం అయినా మేము బయటకు వెళ్లలేం. ఈ సమస్యను మా ఉపాధ్యాయుల దృష్టికి కూడా తీసుకెళ్లాం.

– ఐ.అక్షయ, 9 తరగతి విద్యార్థిని

సమస్యను అధికారులకు తెలియజేశాం



పాఠశాలలో రెండు మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. కానీ దాదాపు 300 మంది విద్యార్థినులు పాఠశాలలో ఉంటున్నారు. వారికి ఈ మరుగుదొడ్లు సరిపోవడం లేదు. ఈవిషయాన్ని అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. నూతనంగా పాఠశాలలో మరుగుదొడ్లను నిర్మిస్తే కొంతవరకు సమస్య తీరుతుంది. బాలికలు ఎక్కువ సమయం అక్కడ వేచి ఉండాల్సిన సమయం తగ్గుతుంది.

– అశ్వనీకుమార్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు, జీహెచ్ఎస్ కొమరోలు

ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సోషల్ ఆడిట్ అధికారి ఓబులేసు

గిద్దలూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల పై ప్రజలకు నమ్మకం కలిగించేలా పాఠశాల సిబ్బంది ప్రయత్నించాలని వైఎస్సార్ జిల్లా కు చెందిన సోషల్ ఆడిట్ అధికారులు ఓబులేసు, దిలీప్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను వారి బృందం మూడు రోజుల క్రితం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన గ్రామ సభ సమావేశంలో వారు మాట్లాడారు. పాఠశాలలోని మౌలిక వసతులు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు వంటి విషయాల పై విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. పాఠశాలలోని సిబ్బంది వివరాలతో పాటుగా విద్యార్థుల సంఖ్య, వారి రిజిస్టర్ పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగభూషణ్‌రెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ బాలునాయక్, ఉపాధ్యాయులు కబీర్, సుభాన్‌ఖాన్, రమాదేవి, ఉషారాణి, విద్యావతి, సిబ్బంది ఉన్నారు.

వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు


రేగడపల్లిలో అలంకరణలో శ్రీవారు

కొనకనమిట్ల: మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీఅలివేలుమంగా సమేత వెలుగొండ వెంకటేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామంలోనూ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలోనూ పూజలు చేశారు.

మార్కాపురంలో డాగ్స్ సెర్టిలైజేషన్ కార్యక్రమం


కుక్కలను పట్టుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

మార్కాపురం టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో వీధి కుక్కలను పట్టుకుని సెర్టిలైజేషన్ (వ్యాక్సినైజేషన్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నారాయణరావు తెలిపారు. ఇటీవల కాలంలో వివిధ ప్రాంతాల్లో మనుషులను కరవడంపై వచ్చిన ఫిర్యాదుల మేరకు కుక్కలకు పునరుత్పత్తి జరగకుండా యానిమల్ కేర్ సొసైటీ ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ చేస్తున్నామని చెప్పారు.

ఘనంగా ఓటర్ల దినోత్సవం


ర్యాలీలో పాల్గొన్న సబ్ కలెక్టర్ త్రివినాగ్, తహసీల్దార్, సీఐ, కమిషనర్, తదితరులు


సీనియర్ సిటిజన్లకు సన్మానం చేస్తున్న అధికారులు

మార్కాపురం: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని మార్కాపురం పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో సబ్‌కలెక్టర్ త్రివినాగ్, స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, తహసీల్దార్ చిరంజీవి, కమిషనరు నారాయణరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు. నాయుడు బజారులో ఓటర్ల దినోత్సవం సందర్భంగా ముగ్గులు, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ త్రివినాగ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటు హక్కుపై అందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువ అమూల్యమని అన్నారు. ఒత్తిళ్లకు లొంగకుండా నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఐ సుబ్బారావు, ఎస్సై సైదుబాబు తదితరులు పాల్గొన్నారు.

జార్జి కళాశాలలో...

స్థానిక జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజబాబు, డీన్ డాక్టర్ మస్తానయ్య విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల కార్యదర్శి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సందేశాన్ని వినిపించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సాధూనాయక్, విజయబాబు, ఆదిసత్యనారాయణ, సురేష్ కుమార్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓటర్ల దినోత్సవం

కంభం: మండలంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ వీ కిరణ్ ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఎంఈఓ కార్యాలయంలో, ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు.

అర్ధవీడులో ...

స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ కులం, మతం, జాతి, వర్గం తదితర ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఓటు వేయాలంటూ ప్రతిజ్ఞ చేయించారు. మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాపినేనిపల్లి గ్రామ సచివాలయం, గురుకుల పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు సత్తార్, లక్ష్మీ నాయక్, డీటీ ప్రసాద్, ప్రిన్సిపాల్ బలరాం రెడ్డి, తదితరుల పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

గిద్దలూరు రూరల్: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాని నియోజకవర్గ ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి ఎం.వెంకటశివారెడ్డి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నుంచి గాంధీ విగ్రహం సెంటర్, వైఎస్సార్ విగ్రహం సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యాలయంలో సీనియర్ సిటిజన్‌లను సన్మానించారు. కొత్తగా ఓటు హక్కు పొందిన వారికి ఓటు కార్డులను అందజేశారు. ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి, సీఐ కె.సురేష్, ఎలక్షన్ డీటీ రామనారాయణరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పొదిలి తహసీల్దార్ కార్యాలయంలో..

పొదిలి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి పాల్గొని ఓటు విలువ గురించి వివరించారు. ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఏఓ జైనులాబ్దిన్, తదితరులు పాల్గొని పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఉత్తమ ఎలక్షన్ ఆపరేటర్‌గా మాలిక్

కంభం: ఉత్తమ ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్‌గా కంభం తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సయ్యద్ మాలిక్ ప్రశంస పత్రం అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగులకు ఇచ్చే ప్రశంస పత్రాల్లో భాగంగా గిద్దలూరు నియోజకవర్గం నుంచి మాలిక్ శనివారం ఒంగోలు కలెక్టరేట్ లో జేసీ రోణంకి గోపాల క్రిష్ణ చేతులమీదుగా ప్రశంస పత్రం అందుకున్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న జార్జి కళాశాల సిబ్బంది


కంభంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు


జేసీ చేతులమీదుగా ప్రశంస పత్రం అందుకుంటున్న మాలిక్

న్యాయవాదులకు ఆటల పోటీలు


క్రికెట్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న జడ్జిలు

మార్కాపురం: రిపబ్లిక్ డేని పురస్కరించుకుని మార్కాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎస్‌వీకేపీ కళాశాలలో న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. సీనియర్ సివిల్ జడ్జి బి.దేవేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కిశోర్‌కుమార్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.బాలాజీ ప్రారంభించారు. మొత్తం 3 జట్లు పాల్గొనగా జి.నవీన్ టీమ్‌పై ఎం.అన్వర్‌బేగ్ టీమ్ 7 వికెట్ల తేడాతో గెలుపొందినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూషని కాశయ్య తెలిపారు. విజేతలకు ఆదివారం జరిగే రిపబ్లిక్ డే వేడుకల్లో బహుమతులు అందజేస్తామని చెప్పారు. ప్రధాన కార్యదర్శి వై.అనీల్‌కుమార్, ఉపాధ్యక్షుడు రవీంద్రనాథ్, సీనియర్ న్యాయవాదులు ఎస్‌కే యూసఫ్ అలీ, వి.శ్రీనివాసరావు, కే నరేంద్రనాథ్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి రాగి తీగ చోరీ

పొదిలి రూరల్: మండలంలోని ఆముదాలపల్లి పంచాయతీ తీగదుర్తిపాడు గ్రామంలో రైతు యర్రారెడ్డి పోలిరెడ్డికి చెందిన పొలంలో శుక్రవారం రాత్రి రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు పగలగొట్టి వాటిలోని రాగి తీగను చోరీ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లను పొలాల్లోనే వదిలేశారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.

గణతంత్ర వేడుకలకు హాజరు కావాలి

బేస్తవారిపేట: స్థానిక మాజీ సైనికుల కార్యాలయంలో శుక్రవారం ఉదయం 8.30 గంటలకు 76వ గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ సైనికుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బొల్లా బాలిరెడ్డి, జిల్లా నాయకుడు పీ వెంకటరాజు తెలిపారు. మాజీ సైనికుల కార్యాలయంలో జండా ఆవిష్కరణ, అనంతరం జంక్షన్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తారన్నారు. నియోజకవర్గంలోని సైనిక వితంతువులను సన్మానిస్తారన్నారు. మాజీ సైనికులు, సైనిక వితంతువులు, సైనికులు, సైనిక కుటుంబాల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ

మార్కాపురం టౌన్: పట్టణంలోని స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ పాఠశాలలోని దివ్యాంగులకు శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దుప్పట్లు, పాలు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ మార్కాపురం పట్టణ అధ్యక్షునిగా ఆంజనేయులు ప్రమాణ స్వీకారం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

పశువులకు వైద్య సేవలతో మేలు

కొనకనమిట్ల: ముందస్తు ప్రణాళిక ప్రకారం అన్ని గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించి పశువులకు చికిత్స చేయడం ద్వారా పశుపోషకులకు మేలు జరుగుతుందని గొట్లగట్టు పశువైద్యాధికారి వి.రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని గార్లదిన్నె గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. గేదెలు, గొర్రెలు, మేకలకు సాధారణ వైద్య పరీక్షలు, గర్భకోశ వ్యాధుల నిర్ధారణ, చూడి పరీక్షలు, గొంతు వాపు వ్యాధి నిరోధక టీకాలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ వరలక్ష్మి, సహాయకులు కోటేశ్వరరావు, గౌరిశ్రీరెడ్డి, మేఘవత్ శివాజీనాయక్, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, పశుపోషకులు పాల్గొన్నారు.